# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,** **విజయవాడ,**

గౌరవ ముఖ్యమంత్రి, **తేది : 23 మార్చి, 2023.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం,** ఆఫీసు కార్యదర్శి

**విషయం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గత నాలుగు రోజుల క్రితం భారీ గాలులు, వడగండ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అసాధారణ నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ...**

**అయ్యా!**

గత నాలుగు రోజుల క్రితం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో వీచిన భారీ గాలులు, వడగండ్ల వానల వల్ల పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో 21-03-2023న నేను, మా పార్టీ బృందంతో కలిసి పర్యటించాను. అనంతపురం జిల్లా నార్పల మండలం నాయనపల్లి, కేశేపల్లి, వెంకటాంపల్లి శ్రీసత్యసాయి జిల్లాలో మూర్తిపల్లి గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించాను అరటి, మొక్కజొన్న, టమోటా, బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కరివేపాకు పంటలు అసాధారణంగా నష్టపోయాయి. రైతుల పరిస్థితి హృదయవిదారకంగా వుంది. సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చేతికి వచ్చిన అరటి, బత్తాయి, బొప్పాయి పంటలు పూర్తిగా దెబ్బతిని, రైతులకు కోట్ల రూపాయల నష్టం జరిగింది. తమరు వెంటనే స్పందించి ప్రత్యక్షంగా పంటల నష్టాన్ని పరిశీలించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

అనంతపురం జిల్లాలో అత్యధిక పంటలు నష్టపోయిన నార్పల మండలం నాయనపల్లి, వెంకటాంపల్లి కేశేపల్లి గ్రామాల్లో పర్యటించాము. రైతులతో కలిసి విషయాలు తెలుసుకోవడంతోపాటు పంట పొలాలను ప్రత్యక్షంగా పరిశీలించాను. ఈ గ్రామాల్లో 580 ఎకరాల్లో అరటి పంట దెబ్బతినింది. వెంకటాంపల్లి గ్రామంలో అరటితోటలు పెద్ద ఎత్తున నేలకు ఒరిగిపోయాయి. ఈ అరటి తోటలు వారం లేదా పదిరోజుల్లో కోత కోయాల్సిన దశలో భీకరమైన గాలులు, వడగండ్ల వానతో పూర్తిగా నష్టం జరిగింది. అరటి పంట సాగుకు ఎకరాకు రూ. 1.30 నుండి 1.50 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు వస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం అరటి టన్ను రూ. 25 వేల నుండి 30 వేల వరకు వుంది. చేతికి వచ్చిన పంట నష్టపోవడంతో ఈ గ్రామాల్లో సుమారు రూ. 50 కోట్లు వరకు నష్టం వచ్చింది. వడగండ్ల వాన తీవ్రతకు ఇదే మండలంలోని కేశపల్లి గ్రామంలో చీని చెట్లు చీలిపోవడం, దాని చిగుర్లు పూర్తిగా రాలిపోయాయి.

అనంతపురం జిల్లాలో 16 మండలాల్లో 11,052 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిని రూ. 211.91 కోట్లు నష్టం జరిగినట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిసింది. వాస్తవ పరిస్థితి అంతకు రెండింతలకు పైగా వుంది. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి రూరల్ మండలంతో పాటు మరికొన్ని గ్రామాల్లో కొన్ని గ్రామాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయింది. కొన్ని గ్రామాల్లో పంట పూర్తి అయిన దశలో ఈ నష్టం జరిగింది.

దెబ్బతిన్న పంటలను అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ అధికారులు పర్యటిస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా పంటల పరిశీలన జరుగుతున్నట్లు వారు మాకు తెలిపారు. ఈక్రాప్ బుకింగ్‌లో వాస్తవ సాగుదారు పేరు నమోదు కాకపోయినా పంట నష్టం ఆధారంగా రైతుల పేర్లు నమోదు చేసి, పరిహారం చెల్లించాలి. అలాగే కౌలు సాగుదార్లు పెట్టుబడి పెద్ద ఎత్తున నష్టపోయారు. ఉదా: నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామంలో రాజు అనే రైతు 12 ఎకరాల్లో ఎకరాకు 25 వేలు కౌలుకు తీసుకొని తీసుకొని అరటి తోట సాగు చేశారు. పెట్టుబడి ఎకరాకు 1 లక్ష 20 వేలు పెట్టాడు. మొత్తం పంట నష్టపోయింది. అయితే ఈ క్రాప్ బుకింగ్‌లో భూమి యజమాని పేరు వుంది. కావున ఇలాంటి వాస్తవ పరిస్థితులను గుర్తించి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో జరిగిన ఈ అపార నష్టాన్ని పూడ్చాలంటే మామూలు స్థాయిలో కాకుండా అదనపు పరిహారం చెల్లించాలి. కావున అసాధారణ నష్టపరిహారం చెల్లించి కౌలురైతులను ఆదుకోవాలని కోరుతున్నాను. రైతులకు ఆత్మ విశ్వాసం కల్పించేందుకు తక్షణం కొంత మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియోగా రైతులకందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

అభివందనములతో...

**(బి.వి.రాఘవులు)**

పోలిట్‌బ్యూరో సభ్యులు